క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బైరెడ్డిపల్లె : మండలంలోని నాగిరెడ్డిపల్లె–టీ ఎన్‌కుప్పం మధ్య వెలసి ఉన్న శ్రీసోమేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో అభిషేకాలు, గంగపూజ, స్వస్తి పుణ్యాహవాచనం, అంకురార్పణం చేపట్టారు. సాయంత్రం అమరనారాయణ స్వామి భజన బృంధం శివకోటి భక్తి పారవశ్యంలో ముంచెత్తింది.

రొంపిచెర్లలో రేపు మంత్రి పర్యటన

రొంపిచెర్ల: రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గురువారం రొంపిచెర్లలో పర్యటించనున్నారు. మంత్రి చేతుల మీదుగా ఆసరా చెక్కును లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు అధికారులు సభా ఏర్పాట్లను పరిశీలించారు. అంగన్‌వాడీ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నవధాన్యాలతో తయారు చేసిన వంటల ప్రదర్శనకు రెండు స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. సభా ఏర్పాట్లను ఎంపీడీవో రాజేంద్ర, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, ఏపీఎం బ్రహ్మానందరెడ్డి, ఏపీవో బాల మురళి, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మునితుకారం, వైఎస్సార్‌సీపీ నాయకులు కరీముల్లా, శేషాద్రినాయుడు, రాజసాహెబ్ తదితరులు పరిశీలించారు.

శేష వాహనంపై శ్రీరాముడు



శేష వాహనంపై ఊరేగింపు

బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లె శ్రీకోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారు శేష వాహనంపై విహరించారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం సీతా లక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి ఉత్సవ మూర్తులను శేషవాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం కల్యాణం కమనీయంగా జరిగింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణం తిలకించి పారవశ్యం చెందారు. అర్చకులు తిప్పాచార్యులు తీర్థప్రసాదాలను అందజేశారు.

మున్సిపాలిటీకి రూ.29.53 లక్షల ఆదాయం



పుంగనూరు: వేలం పాటలు నిర్వహిస్తున్న కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి

పుంగనూరు: మున్సిపాలిటీకి వివిధ నిర్వహణల వేలం పాటల ద్వారా రూ.29.53 లక్షలు ఆదాయం చేకూరినట్లు కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మంగళవారం వారపు సంత, దినసరి మార్కెట్, బస్టాండు వేలం పాటలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. బస్టాండు, దినసరి మార్కెట్, వారపుసంత గేట్ల వసూలు నిర్వహణ హక్కులను సి.రమణారెడ్డి దక్కించుకున్నారని, వీటి ద్వారా మున్సిపాలిటీకి రూ.29.53 లక్షలు లభించినట్లు ఆయన తెలిపారు. ఈ ఆదాయాన్ని మున్సిపల్ ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

స్టేషనరీ కొనుగోలుకు విరాళం



పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దిగవపోకలవారిపల్లె గ్రామ సచివాలయానికి మంగళవారం స్థానిక ఎంపీటీసీ పోకల చంద్ర స్టేషనరీ నిమిత్తం మూడు వేలు విరాళంగా అందజేశారు. నాయకులు పోకల గంగయ్య, దామోదర్‌రెడ్డి, వెంకట రెడ్డెప్ప, చెంగల్‌రాయుడు, సురేష్, నాగయ్య, మోహన్‌రెడ్డి, కార్యదర్శి సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

14న అంబేడ్కర్ జయంతి

పుంగనూరు: మండలంలోని సింగిరిగుంట గ్రామంలో ఈనెల 14న అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్న దళిత సంరక్షణ సంఘం అధ్యక్షుడు గంగప్ప తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దళిత నాయకులు, దళితులతో కలసి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

రిటైర్డ్ లెక్చరర్ రఘుపతి మృతి

పలమనేరు: పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల భౌతికశాస్త్ర రిటైర్డ్ అధ్యాపకుడు రఘుపతి(83) మంగళవారం మృతిచెందారు. పట్టణానికి చెందిన పలువురు పూర్వ విద్యార్థులు ముత్తాచారిపాళెంలోని ఆయన స్వగృహానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళుర్పించారు. బాలాజీ సూపర్‌బజార్ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోష్, ఏపీఎన్జీవోల సంఘం నేత ఆనంద్, పీపీఎస్ నిర్వాహకులు సుబ్రమణ్యంపిళ్ళై, నరసింహులు, గోవింద దివ్యారామం నిర్వాహకులు సిద్దయ్య, కౌన్సిలర్ కుమార్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఆడపడుచులకు ఆర్థిక భరోసా

- వి.కోట మండలంలో రూ.11కోట్ల 78 లక్షల లబ్ధి
- మెగా చెక్కును ఆవిష్కరించిన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ



మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



సీఎం చిత్రపటానికి మహిళల పాలాభిషేకం

వి.కోట: ఆడపడుచులకు అన్నలా, ఇంటికి పెద్దకొడుకులా సీఎం జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా కింద ఆర్థికంగా భరోసా ఇస్తున్నారని ఎమ్మెల్యే వెంకటేగౌడ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మూడవ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం పండగ వాతావరణంలో నిర్వహించారు. మొదట మహిళలు కృతజ్ఞతలు చెబుతూ సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే ఆ కుటుంబాలు బాగుంటాయని సంక్షేమ పథకాల లబ్ధిని వారి ఖాతాల్లోనే జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. మేనిఫెస్టోలోని హామీలను తూచా తప్పకుండా నెరవేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందని తెలిపారు. మూడవ విడతగా మండలంలో 1,290 సంఘాల్లోని 11,997మంది సభ్యుల ఖాతాలకు రూ.11కోట్ల 78 లక్షల లబ్ధి చేకూర్చినట్లు పేర్కొన్నారు. అలాగే ఉన్నతి ఎస్సీ ఎస్టీ రుణాల కింద 72 సంఘాల్లోని 169 సభ్యుల ఖాతాలకు రూ.83 లక్షలను జమచేసినట్లు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో వర్షాలు లేక పశుపక్షాదులు సైతం తాగడానికి నీరు లేక కరువుతో అలమటించాయని, చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రాష్ట్రంలో కరువు కాటకాలని ప్రజల్లో ముద్రపడిందన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వర్షాలు సంవృద్ధిగా కురిసి రాష్ట్రమంతా సస్యశ్యామలంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

పసుపు, కుంకుమతో దగా

గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు నాలుగేళ్ల పాటు డ్వాక్రా మహిళల సంక్షేమాన్ని పట్టించుకోకుండా ఎన్నికల ముందు పసుపు, కుంకుమ పేరిట దగా చేశారని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తీవ్రంగా ఆరోపంచారు. జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఎన్ని హామీలను ఇచ్చారో అంతకుమించి వారికి లబ్ధిని చేకూర్చారని తెలిపారు. ఇప్పటికే రెండు విడతలు వైఎస్సార్ భరోసాను పూర్తిగా మహిళల ఖాతాల్లోకి జమ చేశారని, ప్రస్తుతం మూడవ విడతగా జమ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం మెగా చెక్కులను ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మెన్, ఎంపీపీ యువరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. మొదట అంగన్‌వాడీ కార్యకర్తలు, సంఘ మహిళలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాలు, మహిళల ఉపాధి కార్యక్రమాల ప్రదర్శనలను జెడ్పీ చైర్మన్,ఎమ్మెల్యే పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్ నాగరాజు, మండల కన్వీనర్ బాలగురునాథ్, సింగిల్‌విండో చైర్మెన్లు ధవనంభక్త, గోపిరెడ్డి, వైస్ ఎంపీపీలు లక్ష్మణ్‌రెడ్డి, తమీమ్‌ఖాన్, నాయకులు ఆంజనేయులు, ప్రతాప్‌రెడ్డి, శశికళ, కిషోర్‌రెడ్డి, కృషమూర్తి, హరికుమార్, కుమార్‌రాజా, వెలుగు సీసీలు నాగరాజు, సుబ్రమణ్యం, రామకృష్ణ, చక్రపాణి, మురళి పాల్గొన్నారు.

నేడు మంత్రి పెద్దిరెడ్డి విస్తృత పర్యటన



పుంగనూరులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న పెద్దిరెడ్డి, నాగభూషణం, అలీమ్‌బాషా

- పలు మండలాల్లో ఆసరా చెక్కుల పంపిణీ
- ఏర్పాట్లను పర్యవేక్షించిన నేతలు

పుంగనూరు: మున్సిపల్ పరిధిలో బుధవారం రాష్ట్ర మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం కోరారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని బీఎంఎస్ క్లబ్‌లో బుధవారం మంత్రి ఆసరా చెక్కులను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. మంగళవారం సభాస్థలి ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ కార్యదర్శి పెద్దిరెడ్డి, పీకెఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, మంత్రి పెద్దిరెడ్డి పీఏ చంద్రహాస్‌తో కలసి ఆయన పరిశీలించారు. అలాగే పట్టణంలోని ఎస్‌ఎస్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంత్రి పర్యటన ఏర్పాట్లను ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ మంత్రి మున్సిపాలిటీలో ఉదయం 8.30 గంటలకు చెక్కులు పంపిణీ చేస్తారని తెలిపారు. 9 గంటలకు మండల లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తారన్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, మైనారిటీ సెల్ రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ ఫక్రుద్దీన్‌షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10–30 గంటలకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆసరా మెగా చెక్కును పంపిణీ చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. మంగళవారం సభా ప్రాంగణ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు, ఎంపీపీ రామమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రమేష్‌బాబు, ఎంపీడీఓ సుధాకర్, సర్పంచులు పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం మంత్రి పెద్దిరెడ్డి ఆసరా చెక్కులను పంపిణీ చేయనున్నారు. మంగళవారం సభా ఏర్పాట్లను డీఆర్‌డీఏ పీడీ తులసీతో కలిసి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి పరిశీలించారు. పార్టీ మండల కన్వీనర్ గంగాధరం, ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్‌బాషా, జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, ఎంపీడీఓ నాగరాజ, ఏపీయం శివయ్య పాల్గొన్నారు.

వేకువజాము నుంచే పింఛన్ల పంపిణీ



సదుంలో పింఛన్ల పంపిణీ



సోమల హరిజనవాడలో



రొంపిచెర్లలో..

సోమల: మండలంలోని 15 పంచాయతీలలో మంగళవారం వేకువ జాము నుంచే సామాజిక పింఛన్ల పంపిణీని ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రారంభించారు. కందూరులో ఎంపీపీ ఈశ్వరయ్య, ఎగువపల్లెలో జెడ్పీటీసీ సభ్యురాలు అమాస కుసుమ, కంచంవారిపల్లెలో ఏఎంసీ చైర్మన్ అరుణమ్మ,పెద్ద ఉప్పరపల్లెలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంగాధరం, నండింపల్లెలో వైస్ ఎంపీపీ ప్రభాకర, సోమలలో జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, పార్టీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి ఐలా సూరి, మండల అధ్యక్షుడు వరదం కుమార్ రాజ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్రీనివాసులు, పొదలగుంటపల్లెలో నాగభూషణ్‌రెడ్డి పెన్షన్ పంపిణీని ప్రారంభించారు.

రొంపిచెర్ల: రొంపిచెర్ల–2 గ్రామ సచివాలయంలో పెన్షన్ల పంపిణీని సర్పంచ్ ఇబ్రహీంఖాన్ మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంక్ సెలవుల కారణంగా రెండు రోజులు ఆలస్యంగా పెన్షన్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యదర్శులు నాగరాజ, రవిచంద్రబాబు, సచివాలయల మండల కన్వీనర్ కరీముల్లా, సచివాలయ ఉద్యోగులు ఇంతియాజ్, సుల్తానా, వనజ, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సదుం: మండలంలోని 18 పంచాయతీల పరిధిలో సామాజిక పింఛన్ల పంపిణీ మంగళవారం వేకువ జాము నుంచే ప్రారంభం అయ్యింది. స్థానిక ప్రజాప్రతినిధులు, గృహసారథులు, వలంటీర్ల ఆధ్వర్యంలో పింఛన్లను పంపిణీ చేశారు. ఉదయమే పింఛన్లు అందడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

అత్యధిక మెజారిటీ లక్ష్యం కావాలి



సదుం: సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

సదుం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మండలంలో అత్యధిక మెజారిటీ సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సూచించారు. ఈనెల 7 నుంచి ప్రారంభం కానున్న 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం విజయవంతంపై మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. అందరూ సమష్టిగా పని చేసి వైఎస్సార్ సీపీ పటిష్టతను పెంచాలని కోరారు. గృహసారథులు, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు. అలాగే మండలంలోని బూరగమంద, చెరుకువారిపల్లె, తిమ్మానాయనపల్లె, అమ్మగారిపల్లె, కంభంవారిపల్లె, ఊటుపల్లె సచివాలయాల పరిధిలో అవగాహన సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప, మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, సర్పంచ్‌లు వెంకటరమణ, ఐశ్వర్య, మురళీరెడ్డి, వరలక్ష్మి, రెడ్డిదీప, శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు గంగవరంలో వైఎస్సార్ ఆసరా పంపిణీ

గంగవరం: మండలంలోని డ్వాక్రా మహిళలకు బుధవారం వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హాజరై చెక్కులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న మైదానంలో ఉదయం 9.30 గంటలకు ఆసరా కార్యక్రమం ప్రారంభం కానుంది. ఏర్పాట్లను మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, నాయకులు చంద్రప్ప, చలపతిరెడ్డి, బాలకృష్ణ, బాలాజీ పరిశీలించారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు

చిత్తూరు రూరల్: చిత్తూర ఈశ్వరగుడివీధి శ్రీ అగస్తీశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పంగుణి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నటరాజస్వామి ఉత్సవాన్ని చేపట్టారు. రాత్రి రావణ రావణ వాహన సేవ జరిగింది.

నూతన పంచాయతీలపై ప్రత్యేక శ్రద్ధ



సచివాలయాల ఎండీకి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: మండలంలో నూతనంగా ఏర్పడిన గిరిజన తాండా పంచాయతీల్లో సచివాలయం, రైతు భరోసాకేంద్రం, వెల్‌నెస్ సెంటర్, బీఎంసీయూ భవనాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ భరత్ విజయవాడలోని గ్రామ,వార్డు సచివాలయాల మేనేజింగ్ డైరెక్టర్ మోహన్‌కు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మండలంలో నూతనంగా ఏర్పాటు అయిన పెద్ద తండా, చిక్కపల్లితండా, గుట్టూరుతండా పంచాయతీలను కలుపుతూ పెద్దతండాలో గ్రామ సచివాలయం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ ఫోన్‌లో 'సాక్షి'తో మాట్లాడుతూ త్వరలోనే పంచాయతీల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణాలను చేపట్టనున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ తెలిపారన్నారు. తక్షణ సాయంగా జీజీఎంపీ నిధులు రూ.20 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎండీని కలసిన వారిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, పెద్దతండా సర్పంచ్ మోహన్‌నాయక్, రెస్కో డైరెక్టర్ రవినాయక్, నేతలు భాస్కర్‌నాయక్, చిన్నరాజునాయక్, మురుగేష్ ఉన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు కార్పొరేషన్: వేసవిలో విద్యుత్ పరికరాలు కొరత లేకుండా అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో సీఈ చలపతి అన్నారు. మంగళవారం స్థానిక ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా స్టోర్స్‌ను ఆయన ఎస్ఈ కృష్ణారెడ్డితో కలిసి పరిశీలించారు. ఉమ్మడి జిల్లాకు ఒకే స్టోర్ ఉందని, వీటికి అనుబంధంగా సబ్‌డివిజన్ స్టోర్ ఏర్పాటు చేయాలని డీఈ జయప్రకాష్ తెలుపగా, ప్రతిపాదనలు పంపాలని సీఈ పేర్కొన్నారు. రైతులకు సకాలంలో ట్రాన్స్ ఫార్మర్లు ఇవ్వాలని ఆదేశించారు. జగనన్న కాలనీలకు ట్రాన్స్‌ఫార్మర్లు ఎప్పటికప్పుడు ఇవ్వాలని తెలిపారు.

వైభవం.. గిరిజా కల్యాణం



విశేషాలంకరణలో స్వామి,అమ్మవార్లు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

రామకుప్పం: మండల కేంద్రంలోని శ్రీఅన్నపూర్ణాంబ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గాండ్లసంఘం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం రుద్రాభిషేకం,ప్రత్యేక అలంకరణల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి పల్లకిపై మాడవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం మేళతాళాలు, వేదమంత్రోచ్చారణ నడుమ ఉత్సవ మూర్తులను కల్యాణ వేదికపై అధిష్టింపజేశారు. భక్తజన సందోహం హరహర మహదేవ శంభో శంకర నామస్మరణ నడుమ గిరిజామాత, పరమేశ్వరుని కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. గాండ్లసంఘం సభ్యులు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం మేళతాళాల నడుమ పార్వతీపరమేశ్వర్లు ఊరేగింపు వేడుకగా జరిగింది. అడుగడుగునా భక్తులు మంగళహారతులిచ్చారు. బుధవారం రథోత్సవం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పేదల ఇంటి ముంగిటకే సంక్షేమం



మాట్లాడుతున్న ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె : పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప పేర్కొన్నారు. బైరెడ్డిపల్లెలో మంగళవారం సచివాలయ కన్వీనర్లతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వానికి మన ప్రభుత్వానికి తేడాను ప్రజలకు వివరించాలన్నారు. సచివాలయాలను ప్రవేశపెట్టి వేలాది మంది యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు లక్షల మందికి వలంటీర్లుగా అవకాశం కల్పించారన్నారు. గతంలో జన్మభూమి కమిటీలు చెప్పిన వారికి మాత్రమే పథకాలు అందేవని తెలిపారు. జగనన్న ప్రభుత్వంలో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన అన్ని కుటుంబాలకు పథకాలు వర్తింపజేస్తున్న విషయాన్ని తెలియజేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధిని టీడీపీ నాయకులు ఓర్వలేక ఎల్లో మీడియా ద్వారా బురద జల్లుతున్నారన్నారని విమర్శించారు. విమర్శలను తిప్పికొట్టాలని సూచించారు. మండల సచివాల కన్వీనర్ కార్తీక్, మండల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో ఆశాలే కీలకం

గంగవరం: ప్రజల ఆరోగ్య పరిరక్షణ బాధ్యత ఆశాలదే అని వైద్యాధికారి మల్లికార్జున పేర్కొన్నారు. మండలంలోని పత్తికొండ పీహెచ్‌సీలో మంగళవారం ఆశా డే సందర్భంగా ఆశాలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వైద్య సలహాలు ఇవ్వాలని తెలిపారు. ప్రస్తుతం వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో వడదెబ్బకు గురికాకుండా తగిన సూచనలు ఇవ్వాలన్నారు. డెలివరీలు ప్రభుత్వాస్పత్రుల్లో చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. పత్తికొండ పీహెచ్‌సీకి 104 వాహనం అందుబాటులోకి రానుందని, గ్రామాల్లో 104 సేవలు త్వరలో ప్రారంభం అవుతాయని తెలిపారు.

సారా స్వాధీనం- ఒకరి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

రొంపిచెర్ల/కల్లూరు : సారా స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు పులిచెర్ల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ శ్రీనివాసమూర్తి తెలిపారు. సీఐ కథనం.. ముందుగా అందిన సమాచారం మేరకు గానుగచింత రోడ్డులోని రొంపిచెర్ల సబ్ స్టేషన్ వద్ద ఎక్సైజ్ పోలీసులు కాపు కాచి సారా తీసుకు వస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. విచారణలో నిందితుడిని అన్నమయ్య జిల్లా పీలేరు మండలం జాండ్లకు చెందిన లక్ష్మీరెడ్డి(45)గా గుర్తించారు. ఐదులీటర్ల సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు అదేశించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో సిబ్బంది సుధాకర్, విజయ్, ఈసీ మధు, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

గదుల నిర్మాణాలు ఆపాలని ధర్నా

పలమనేరు: పట్టణంలోని జవిళివీధి ఫిషరీస్ కార్యాలయానికి తూర్పు వైపున మున్సిపల్ అధికారులు నిర్మించనున్న తాత్కాలిక గదుల నిర్మాణ పనులను ఆపాలంటూ స్థానిక టీడీపీ నాయకులు మంగళవారం కొంతసేపు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ అనాలోచిన నిర్ణయాలతో పట్టణ అభివృద్ధి తిరోగమనంలోకి వెళుతోందన్నారు. ఇప్పటికైనా ఈ నిర్మాణాలను ఆపాలని డిమాండ్ చేశారు. నాయకులు కుట్టి, సుబ్రమణ్యంగౌడు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.